క్లుప్తంగా

28, 29 తేదీల్లో కబడ్డీ పోటీలు

కవిటి: కెకొత్తూరులో సిద్ధి వినాయక ఉత్సవ (పులకలవీధి) కమిటీ ఆధ్వర్యంలో ఈ నెల 28, 29 తేదీల్లో ఇచ్ఛాపురం నియోజకవర్గ స్థాయి కబడ్డీ పోటీలు నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని కమిటీ సభ్యులు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల జట్లు 87953 76078, 63021 70110 నంబర్లను సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

క్రీడాకారుడికి ఆర్థిక సాయం

వజ్రపుకొత్తూరు: బెజ్జిపానిపేట గ్రామానికి చెందిన క్రీడాకారుడు వాడ్రేవు రాజేష్ వచ్చే నెల తొమ్మిది నుంచి 11వ తేదీ వరకు జరగనున్న జాతీయస్థాయి అథ్లెటిక్ పోటీల్లో పాల్గొననున్నాడు. దీంతో అతన్ని ప్రోత్సహించేందుకు ఉద్దానం హెల్పింగ్ సోసైటీ ప్రతినిధులు పది వేల రూపాయలను సమకూర్చారు. ఈ మొత్తాన్ని క్రీడాకారుడుకి ఆదివారం అందజేసి అభినందించారు. సొసైటీ అధ్యక్షులు కె.ఎల్. విజయ్, ప్రతినిధులు శివాజీ, సైని శాంతి, సావిత్రి, మురళి ఉన్నారు.

పాఠశాలకు బీరువా వితరణ



బీరువాను అందజేస్తున్న ఉపాధ్యాయులు

నందిగాం: పెద్దతామరాపల్లి ప్రాథమిక పాఠశాలకు ఇటీవల బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులు బీరువాను వితరణగా అందించారు. ప్రధానోపాధ్యాయులుగా పనిచేసి వెళ్లిన కె.గున్నయ్య, వి.కుమారిలను పాఠశాల సిబ్బంది, గ్రామస్థులు ఘనంగా సత్కరించి సేవలను కొనియాడారు. హెచ్ఎం సీహెచ్ హైమావతికి బీరువాను అందజేశారు.

ఆదికర్మయోగి అభియాన్‌పై శిక్షణ



శిక్షణలో మాట్లాడుతున్న అధికారులు

కంచిలి: గిరిజన గ్రామాల్లో పాలన వ్యవస్థ మెరుగు పర్చడమే ఆదికర్మయోగి అభియాన్ ముఖ్యఉద్దేశమని జిల్లా రిసోర్స్‌పర్సన్ రమేష్ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో ఆది కర్మయోగి అభియాన్‌పై రెండు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని సోమవారం ప్రారంభించారు. ఆది కర్మయోగి అభియాన్ క్రింద నువాగడ పంచాయతీని ఎంపిక చేసినట్లు అధికారులు వెల్లడించారు. గిరిజనుల అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. రిసోర్స్‌పర్సన్‌లు ఎన్.గోపి, పి.భాగ్యలక్ష్మి, ఆర్.ధనలక్ష్మి, ఎస్.లోకనాథం పాల్గొన్నారు.

అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న కామేశ్వరరావు

పలాస: గిరిజనులకు ప్రభుత్వం కల్పించిన అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సీనియర్ న్యాయవాది బలివాడ కామేశ్వరరావు పట్నాయక్ అన్నారు. దానగొర గ్రామంలో గిరిజనుల సంక్షేమ పథకాలు, బాల్యవివాహాల నిషేధ చట్టాలపై సోమవారం అవగాహన కల్పించారు. జిల్లా న్యాయ సేవా సంస్థ, పలాస జూనియర్ సివిల్ జడ్జి ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. సీనియర్ న్యాయవాది కె.లోకేశ్వరరావు, జి.ఎం.ఎస్ అనిల్‌రాజు, పంచాయతీ కార్యదర్శి సుధాకర్, సి.ఎఫ్.సుహాసిని, ఎస్.జగన్నాయకులు ఉన్నారు.

కొత్త పింఛన్ల ఊసేలేదు



దళ్లి జానకీరావు

మందస: కూటమి ప్రభుత్వ హయాంలో కొత్త పింఛన్లు మంజూరు చేయకుండా ఉన్న పింఛన్లను తొలగిస్తుండడం దారుణమని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు దళ్లి జానకీరావు అన్నారు. ఈ మేరకు సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. కూటమి ప్రభుత్వ పాలనలో దివ్యాంగులు, రైతులతో పాటు ఏడాది కాలంగా సామాజిక పింఛన్ల కోసం ఎదురు చూస్తున్న అర్హులు మోసపోయారన్నారు. ఎరువుల కోసం రైతులు నానా అవస్థలు పడుతున్నారన్నారు. డిమాండ్ మేరకు ఎరువులను సరఫరా చేయడంతలో ప్రభుత్వం విఫలమైందన్నారు.

రక్షణ కల్పించండి

టెక్కలి: తమకు చెందిన జిరాయితీ స్థలంలో రోడ్డు వేయాలని ప్రయత్నిస్తున్నారని దీనిని అడ్డుకునే క్రమంలో తమకు ప్రాణహాని ఉందని, రక్షణ కల్పించాలని చాకిపలికి చెందిన ముద్దాడ లక్ష్మీనారాయణప్రసాద్ పోలీసులను ఆశ్రయించారు. గ్రామంలో సర్వే నంబర్ 95/4 లో తమకు సుమారు ఐదు సెంట్లు జిరాయితీ స్థలం ఉందని.. వైఎస్సార్‌సీపీకి అనుకూలంగా ఉన్నామనే కక్షతో తమ స్థలం మీదుగా రోడ్డు వేయాలని ప్రయత్నిస్తున్నారన్నారు. ఈ నేపథ్యంలో సోమవారం జేసీబీతో స్థలాన్ని తవ్వేందుకు ప్రయత్నించగా అడ్డుకున్నామని పేర్కొన్నారు. ప్రాణభయంతో 100కు సమాచారం ఇచ్చామని తెలిపారు. తమ స్థలానికి సంబంధించి అన్ని రకా ల పత్రాలు ఉన్నప్పటికీ అన్యాయంగా ఎవరికీ ఉపయోగం లేని చోట రోడ్డు వేసేందుకు ప్రయత్నిస్తున్నారని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. సర్పంచ్ వాన తవిటయ్య తో టెక్కలి పోలీస్‌స్టేషన్‌ను ఆశ్రయించి రక్షణకు కల్పించి న్యాయం చేయాలని కోరారు.

వరి కష్టాలు సాగు!



కాడేడ్లతో పొలం చదును చేస్తున్న రైతు

సోంపేట:

రోజూ అన్నం లేకపోతే చాలామందికి ఆహారం తిన్నట్టే ఉండదు. కాని వరి పంట సాగు రైతులకు ఏమాత్రం కలిసి రావడంలేదు. ఓ వైపు పెరిగిన పెట్టుబడులు, మరో వైపు కూలీల కొరత వారిని వేధిస్తుంది. అయినప్పటికీ పంటసాగుపై నిర్లక్ష్యం చేయడం లేదు. ఇటీవల కురిసిన వర్షాలకు ఇచ్ఛాపురం నియోజకవర్గంలో ఆలస్యంగా వరి నాట్లు మొదలయ్యాయి. ఇంకా చాలా ప్రాంతాల్లో సాగు నీరు లేక ఉభాలు ప్రారంభం కాలేదు. ముదురుతున్న నారు, సాగునీరు కూడా సమృద్ధిగా లేక పోవడంతో నానా పాట్లు పడుతున్నారు.

పెట్టుబడులు ఇలా..	రూపాయల్లో..
నారుమడి తయారు చేయడానికి	1000
విత్తనాలు	1000
విత్తనాలు చల్లడానికి	500
నారుమడికి గడ్డి మందు	300
దమ్ము చేయడానికి ట్రాక్టర్	4,000
గట్లు వేయడానికి	2,000
నాట్లు వేయడానికి, ఆకు మోత కూలీ	7,000
ఎరువులకు	2,000
కలుపు మందు	2,000
వరి కోత, ధాన్యం పోగు చేయడానికి	4,000

తగ్గిన సాగు విస్తీర్ణం..

నియోజకవర్గం పరిధిలోని కంచిలి, కవిటి, ఇచ్ఛాపురం, సోంపేట మండలాల్లో గత ఏడాది సుమారు 45 వేల ఎకరాల్లో వరిపంట సాగు చేశారు. అధిక పెట్టుబడులు, దిగుబడులు ఆశించినంత లేక పోవడంతో ఈ ఖరీఫ్‌లో సుమారు పది వేల ఎకరాల్లో వరి సాగు విస్తీర్ణం తగ్గింది. దీనికి ప్రధాన కారణం పెట్టుబడులు పెరగడం, ఆశించిన దిగుబడి లేకపోవడం, వర్షాలు సకాలంలో లేకపోవడమే.

తగ్గిన పశు సంపద

ప్రస్తుతం వ్యవసాయం రంగంలో కూడా సాంకేతికత అందుబాటులోకి వచ్చింది. గతంలో 50 సెంట్లు ఉన్న రైతు కూడా కాడెడ్లు కట్టుకుని నెమ్మదిగా వ్యవసాయం చేస్తుండేవాడు. దీంతో పెట్టుబడులు తగ్గేవి. ప్రస్తుతం కాడెడ్లు మచ్చుకైనా కనపడని పరిస్థితి. వ్యవసాయ యాంత్రీకరణ పెరగడం, రైతులు యంత్రాలతో పనిచేయిస్తుండడంతో పెట్టుబడులు పెరుగుతున్నాయి. పంట చేతికందే సమయానికి ఏకరానికి సుమారు రూ. 24 వేలు పెట్టుబడి అవుతోందని రైతులు చెబుతున్నారు. పంట బాగా పండి చేతికందితే మిగులు వస్తుందని, లేదంటే చేతి చమురు వదిలించుకోవాల్సి వస్తుందంటున్నారు.

మద్దతు ధర పెంచాలి



వరి పంటకు కేంద్ర ప్రభుత్వం మద్దతు ధర పెంచాలి. ప్రస్తుతం పెట్టుబడికి తగ్గట్టుగా మద్దతు ధర లేక పోవడంతో రైతులు నష్టపోవాల్సి వస్తుంది. విపత్తులు వస్తే రైతుకు చిల్లి గవ్వ మిగలడం లేదు. పెట్టుబడలు పోయి తీవ్రంగా నష్ట పోతున్నాడు.

– పోకల మీనకేతనిరావు, జింకిభద్ర, సోంపేట మండలం

'ఉపాధి'ని అనుసంధానం చేయాలి



కేంద్ర ప్రభుత్వం స్పందించి ఉపాధిహామీ పథకాన్ని వ్యవసాయానికి అనుసంధానం చేయాలి. ఇలా చేస్తే రైతులకు చాలా ప్రయోజనం కలుగుతుంది. సాగుకు పెట్టుబడి తగ్గే అవకాశం ఉంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆలోచించి రైతులకు న్యాయం చేయాలి. – పోకల ఢిల్లీరావు, జింకిభద్ర, రైతు, సోంపేట మండలం

వెద సాగు ప్రత్యామ్నాయం



ప్రస్తుతం వరినాట్లు వేసి సాగు చేస్తుంటే రైతులకు పెట్టుబడి అధికం అవుతుంది. వరిపంటను వెద పద్ధతిలో సాగు చేస్తే రైతులకు పెట్టుబడి తగ్గడంతోపాటు పంట దిగుబడి పెరుగుతుంది. రైతులు వెద సాగుకు ముందుకు రావాలి.

– బి.నర్సింహమూర్తి, వ్యవసాయాధికారి, సోంపేట



వరినాట్లు వేస్తున్న మహిళలు

కల్వర్టు నిర్మాణానికి సహకరించాలని వినతి

సోంపేట: జింకిభద్ర గ్రామ పంచాయతీ పరిధిలోని నీలకంఠ సాగర్–నేరంబడి చెరువు కాలువపై ఇరిగేషన్ అధికారుల అనుమతితో నిర్మిస్తున్న కల్వర్టు పనులకు సహకరించాలని జింకిభద్ర రైతులు కోరారు. ఈ మేరకు ఇరిగేషన్ ఈఈ పి.సుధాకరరావును సోమవారం శ్రీకాకుళంలోని ఇరిగేషన్ కార్యాలయంలో కలిసి వినతి పత్రం అందజేశారు. వ్యవసాయ ఉత్పత్తుల రవాణా సౌకర్యార్థం అధికారుల అనుమతితో కల్వర్టు నిర్మాణం చేపడుతున్నామ ని రైతులు వివరించారు. అధికారులు సహకరించి నిర్మాణం పూర్తయ్యేలా చూడాలని కోరారు. వినతి పత్రం అందజేసిన వారిలో నాతి సోమయ్య, తామాడ దిలీప్, సంగారు భైరాగి, పాతిన భైరాగి ఉన్నారు.



ఈఈ సుధాకరరావుకు వినతిపత్రం అందజేస్తున్న రైతులు

పశువులను రోడ్లపైకి విడిచిపెడితే జరిమానా

పలాస: పశువులను రోడ్లపైకి విడిచిపెడితే జరిమానా విధిస్తామని పలాస–కాశీబుగ్గ మున్సిపల్ కమిషనర్ ఎన్.రామారావు చెప్పారు. ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదుల మేరకు రోడ్లపై తిరిగే పశువులను పట్టుకొని కాశీబుగ్గలోని ఆర్అండ్‌బీ బంగ్లా ఆవరణలో ఏర్పాటు చేసిన బంజరు దొడ్డిలో ఉంచుతామని సోమవారం తెలిపారు. బంజరు దొడ్డిలో కట్టడి చేసిన పశువులకు మొదటి సారిగా సంబంధిత యజమాని నుంచి రూ. 500, రెండో సారి రూ.1000, మూడోసారి రూ.2000 జరిమాన విధిస్తామని చెప్పారు. ఆ తర్వాత కూడా రోడ్లపైకి పశువులను విడిచి పెడితే పట్టుకొని గోశాలకు తరలిస్తామన్నారు.

స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ

ఇచ్ఛాపురం/కవిటి/పలాస: రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా రూపొందించిన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ సోమవారం నుంచి ప్రారంభమైంది. ఇచ్ఛాపురం మున్సిపాలిటీ, మండలం పరిధిలోని 49 ప్రభుత్వ రేషన్ దుకాణాలకు చెందిన 26,247 స్మార్ట్‌రేషన్ కార్డులను పంపిణీ చేసినట్లు డిప్యూటీ తహసీల్దార్ శ్రీహరి తెలిపారు. కవిటి మండలానికి 22,251 స్మార్ట్ రేషన్ కార్డులు వచ్చాయని తహసీల్దార్ బి. మురళీమోహనరావు చెప్పారు. కవిటిలోని రెండో నంబర్ డిపో వద్ద కార్డులను తొలిరోజు పంపిణీ చేశామన్నారు. పలాస మండలం రెంటికోటలో నిర్వహించిన కార్డుల పంపిణీలో తహసీల్దార్ టి.కళ్యాణ చక్రవర్తి, ఏపీ ట్రేడ్ కార్పొరేషన్ చైర్మన్ వజ్జ బాబూరావు పాల్గొన్నారు.



పలాస: రెంటికోటలో స్మార్ట్ కార్డులను పంపిణీ చేస్తున్న అధికారులు

ఉద్దానం ప్రాజెక్టు కార్మికులను విధుల్లోకి తీసుకోవాలి

పలాస: ఉద్దానం మంచినీటి ప్రాజెక్టులో పని చేసిన కాంట్రాక్టు కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని సీపీఐ ఎంఎల్ లిబరేషన్ నాయకులు కోరారు. ఈ మేరకు ప్రాజెక్టు కార్మికులు కాశీబుగ్గలోని మహాత్మాగాంధీ విగ్రహం వద్ద చేస్తున్న రిలేనిరాహార దీక్షల వద్దకు సోమవారం వెళ్లి వారికి సంఘీభావం తెలిపారు. దశాబ్దాలుగా పని చేస్తున్న కార్మికులకు అర్ధాంతరంగా విధుల నుంచి తొలగిస్తూ నోటీసులు ఇవ్వడం సరికాదన్నారు. నాయకులు తామాడ సన్యాసిరావు, మద్దిల రామారావు, పిన్నింటి నాగేశ్వరరావు, పోతనపల్లి అప్పారావు ఉన్నారు.



కార్మికులకు సంఘీభావం తెలుపుతున్న లిబరేషన్ నాయకులు

ఐకమత్యంగా ఉత్సవాలు నిర్వహించాలి

ఇచ్ఛాపురం రూరల్: వినాయక నవరాత్రులను వివాదాలు లేకుండా ఐక్యతతో నిర్వహించాలని రూరల్ ఎస్ఐ ఇ.శ్రీనివాస్ అన్నారు. టి.బరంపురం, శాసనాంలో చవితి ఉత్సవాలను నిర్వహిస్తున్న యువకులతో సోమవారం మాట్లాడారు. ఉత్సవాలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించే సమయంలో అశ్లీల నృత్యాలు, డీజేలు, మద్యం సేవించడం వంటివి నిషేధమని, తమ ఆదేశాలు జవదాటితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



టి.బరంపురంలో మాట్లాడుతున్న ఎస్సై శ్రీనివాస్

దివ్యాంగ పింఛన్లను పునరుద్ధరించాలి

శ్రీకాకుళం పాతబస్టాండ్: టెక్కలి నియోజకవర్గంలో వెరిఫికేషన్ పేరిట తొలగించిన దివ్యాంగుల పింఛన్లను పునరుద్ధరించాలని వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి పేరాడ తిలక్ కోరారు. ఈ మేరకు జిల్లా కేంద్రంలో సోమవారం నిర్వహించిన ప్రజాఫిర్యాదుల నమోదు, పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)లో జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌కు వినతి పత్రం అందజేశారు. నియోజకవర్గంలో దివ్యాంగ, ఇతర పింఛన్లు సుమారు 400 తొలగించడంతో వారంతా ఆత్మస్థైర్యాన్ని కోల్పోతున్నారన్నారు. మానవతా దృక్పథంతో పింఛన్లను కొనసాగించాలని విజ్ఞప్తి చేశారు.

మట్టి వినాయకుడినే పూజిద్దాం



ఇచ్ఛాపురం రూరల్: మట్టి విగ్రహాలు పంపిణీ చేస్తున్న కొళిగాం హైస్కూల్ విద్యార్థులు

టెక్కలి: మట్టి వినాయకుడినే పూజిద్దాం..పర్యావరణాన్ని కాపాడుదాం అంటూ టెక్కలి మండలం రావివలస జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు సోమవారం ర్యాలీ నిర్వహించారు. ఏపీ గ్రీన్ కార్ప్స్ ఆధ్వర్యంలో జీఎస్ జ్యూయలరీ సంస్థ అందజేసిన మట్టి వినాయకుడి ప్రతిమలతో ర్యాలీ చేపట్టారు. అనంతరం 140 మందికి మట్టి వినాయక ప్రతిమలను అందజేశారు. ప్రధానోపాధ్యాయురాలు ఆర్.యమున, విద్యా కమిటీ చైర్మన్ బి.సురేష్, మాజీ సర్పంచ్ బి.జగదీష్ పాల్గొన్నారు.

సోంపేట: పర్యావరణాన్ని కాపాడడం ప్రతీ వ్యక్తి బాధ్యతని ఎస్ఎస్ సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు దుద్ది శ్రీనివాసరావు అన్నారు. సోంపేట పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదురుగా సేవాసంస్థ ఆధ్వర్యంలో మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేశారు. సామాజిక ఆస్పత్రి విశ్రాంత సూపరింటెండెంట్ ఇ.లక్ష్మీనారాయణ, సేవాసంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం రూరల్: పర్యావరణానికి హాని కలిగించే ప్లాస్టర్ ఆఫ్ పారీస్ వద్దు...మట్టి విగ్రహాలే ముద్దు అని కొళిగాం ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు నరేంద్రనాథ్ పట్నాయక్ అన్నారు. విద్యార్థులు తయారీ చేసిన మట్టి విగ్రహాలను స్థానికులకు పంపిణీ చేశారు. అలాగే ఈదుపురం కంద్రావార్డు ఉన్నత పాఠశాల నేషనల్ గ్రీన్ కోర్ విద్యార్థులు తయారు చేసిన మట్టి విగ్రహాలను గ్రామస్తులకు పంపిణీ చేశారు. ప్రధానోపాధ్యాయురాలు బూరవిల్లి ఉమామహేశ్వరి, ఉపాధ్యాయులుభాస్కర్ పాడీ, సబితా కుమారీ, ప్రశాంత లిమ్మాయి పాల్గొన్నారు.



టెక్కలి: మట్టి వినాయక విగ్రహాలతో విద్యార్థినులు



సోంపేట: మట్టి వినాయక విగ్రహాలు పంపిణీ చేస్తున్న శ్రీనివాసరావు తదితరులు



ఇచ్ఛాపురం రూరల్: పంపిణీకి సిద్ధం చేసిన ఈదుపురం ఎన్‌జీసీ విద్యార్థులు

రైతులందరికీ ఎరువులు సరఫరా చేయాలి

ఇచ్ఛాపురం రూరల్: వివక్షత లేకుండా రైతులందరికీ ఎరువులు అందజేసేందుకు చర్యలు తీసుకోవాలని ఎంపీపీ బోర పుష్ప కోరారు. ఈ మేరకు సోమవారం మండల వ్యవసాయాధికారి పి.పి.వి.వి.అజేయ్ కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. మండలంలో 12 వేల ఎకరాల్లో వరిని రైతులు సాగుచేస్తుండగా.. ఎక్కువ యూరియాను కూటమి ప్రభుత్వ సానుభూతిపరులకు ఇవ్వడంతో మిగిలినవారు ఇబ్బందులు పడుతున్నారన్నారు. వినతిపత్రం అందించిన వారిలో మాజీ ఎంపీపీ కారంగి మోహనరావు, టి.బరంపురం సర్పంచ్ కారంగి త్రినాథ్ ఉన్నారు.



ఏవోకు వినతిపత్రం అందజేస్తున్న ఎంపీపీ పుష్ప

క్రమబద్ధీకరణకు సదవకాశం!

- అనధికార లేఅవుట్లు, ప్లాట్లకు అనుమతులు
- ఎల్ఆర్ఎస్‌తో క్రమబద్ధీకరణ



మున్సిపాలిటీ పరిధిలో అధికారులు గుర్తించిన అనధికార లేఅవుట్

ఇచ్ఛాపురం:

ప్రభుత్వం ఎల్ఆర్ఎస్ (లేఅవుట్ రెగ్యులరైజేషన్ స్కీమ్) ద్వారా అనధికార లేఅవుట్లు, ప్లాట్లకు అనుమతులు పొందేందుకు.. రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు ప్రభుత్వం జీవోను ఇటీవల విడుదల చేసింది. అనధికార ప్లాట్ల క్రమబద్ధీకరణకు వెసులుబాటు కల్పిస్తూ ఎల్ఆర్ఎస్–2000 పథకాన్ని ఈ ఏడాది జూలై 26వ తేదీన సవరణ చేశారు. అనధికార లేఅవుట్లు, ప్లాట్ల క్రమబద్ధీకరణ కోసం దరఖాస్తులు చేసుకొనేందుకు ఈ ఏడాది అక్టోబర్ 24వ తేదీ వరకు అవకాశం కల్పించింది. ఇచ్ఛాపురం పట్టణంలో పుట్టగొడుగుల్లా అనధికార లేఅవుట్లు వెలిశాయి. రియల్‌ఎస్టేట్ వ్యాపారంలో రియల్టర్లు చెప్పే మాయమాటలను నమ్మి ప్రజలు లక్షలాది రూపాయలు వెచ్చించి ప్లాట్లను కొనుగోలు చేశారు. వీరిలో కొందరు అప్పులు చేసి మరీ ప్లాట్లను కొనుక్కున్నారు. ఇటీవల మున్సిపల్ అధికారులు అనధికార లేఅవుట్లను గుర్తించి అందులో మార్కింగ్‌లను తొలగించడం, సంబంధిత యజమానులకు నోటీసులు జారీ చేశారు. దీంతో ప్లాట్లను కొనుగోలు చేసుకొన్న వారిలో అయోమయ పరిస్థితి నెలకొంది. ఇటువంటి వారికి ఎల్ఆర్ఎస్ పథకం ద్వారా ప్లాట్లను క్రమబద్ధీకరించుకోవడానికి ప్రభుత్వం అవకాశం కల్పించింది. లేఅవుట్లలో కాకుండా నాలుగు వేల చదరపు మీటర్ల కంటె తక్కువ విస్తీర్ణం కలిగిన వ్యక్తి గత సైట్లకు కూడా రాయితీలు కల్పించింది. అనధికార ప్లాట్లను క్రమబద్ధీకరించుకునేందుకు ఎల్ఆర్ఎస్ వెబ్‌సైట్ ద్వారా ఈ నెల నాలుగో తేదీ నుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్నారు. క్రమబద్ధీకరణకు 90 రోజులు గడువునిచ్చారు. అలాగే జూన్ 30వ తేదీలోపు రిజిస్టర్ చేసుకున్న ప్లాట్లకు ఓపెన్ స్పేస్ చార్జీలలో 50 శాతం రాయితీ కల్పించారు. ప్లాట్ల పీనలైజేషన్‌కు దరఖాస్తులు చేసుకున్న వారు 45 రోజుల్లో మొత్తం చార్జీలు చెల్లిచినట్‌లైతే వారికి అదనంగా మరో పది శాతం రాయితీ కల్పిస్తుంది. నిర్దేశించిన సమయం 90 రోజుల్లో చెల్లిస్తే ఐదు శాతం రాయితీని కల్పిస్తున్నట్లు మున్సిపల్ అధికారులు తెలిపారు. ప్రస్తుత మార్కెట్ విలువ ఆధారంగానే ఎల్ఆర్ఎస్ చార్జీలు ఉంటాయి.

38 లేఅవుట్లు..

ఇచ్ఛాపురం మున్సిపాలిటీ పరిధిలో మొత్తం 38 లేఅవుట్లు ఉన్నాయి. వీటిలో 17 లేఅవుట్లకు అనుమతులుండగా.. ఏడు రెగ్యులరైజేషన్ అయ్యాయి. 14 అనధికార లేఅవుట్లను గుర్తించినట్లు మున్సిపల్ అధికారులు వెల్లడించారు. వీటితోపాటు క్రమబద్ధీకరణ చేసుకోవలసిన స్థలాలు చాలా ఉన్నాయి. భవన నిర్మాణంలో మున్సిపల్ బిల్డింగ్ ప్లాన్ కోసం దరఖాస్తు చేసుకునే సమయంలో ఇటువంటివి వెలుగులోకి వస్తున్నాయి.

ఎల్ఆర్ఎస్‌ని సద్వినియోగం చేసుకోవాలి



ఇచ్ఛాపురం మున్సిపాలిటీలో అనధికారంగా ఉన్న ప్లాట్లతో పాటు వ్యక్తిగత స్థలాలను కూడా ఎల్ఆర్ఎస్ స్కీం ద్వారా క్రమబద్ధీకరణ చేసుకోవచ్చు. నిబంధనల మేరకు ప్రభుత్వం అందించే రాయితీలను సద్వినియోగం చేసుకొని అనధికారి ప్లాట్లను క్రమబద్ధీకరించుకోవాలి. క్రమబద్ధీకరణ చేసుకునే లేఅవుట్లలో ప్రభుత్వమే మౌలిక వసతులను కల్పించడంతో పాటు భవన నిర్మాణాలకు అవసరమైన అనుమతులను సులభంగా అందజేస్తుంది.

– ఎస్.రమేష్, మున్సిపల్ కమిషనర్, ఇచ్ఛాపురం

నేత్రదానంపై అవగాహన



బాల్యదశ నుంచి వృద్ధుల వరకు ప్రతిఒక్కరూ ఎప్పటికప్పుడు తమ కళ్లను నేత్ర వైద్యులచే పరీక్షలు చేయించుకుంటూ సంరక్షించుకోవాలని డి.జి.పురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ ఎం.విశ్వనాథ్ గంగాధర్ అన్నారు. జిల్లా అంధత్వ నివారణ సంస్థ సౌజన్యంతో ఈ నెల 25 నుంచి సెప్టెంబర్ ఎనిమిదో తేదీ వరకు జరుగుతున్న జాతీయ నేత్రదాన పక్షోత్సవాల సందర్భంగా దండుగోపాలపురం పీహెచ్‌సీలో కంటి ఆరోగ్యం– నేత్రదానంపై సోమవారం అవగాహన కల్పించారు. రక్తపోటు, మధుమేహం వంటి దీర్ఘకాలిక వ్యాధుగ్రస్తులు తరచూ కంటి పరీక్షలు చేయించుకోవాలన్నారు. ఆప్తాల్మిక్ అధికారి ఎం.ఆర్.కె.దాస్, ఆరోగ్య విస్తరణాధికారి వి.వి.నాగేశ్వరరావు పాల్గొన్నారు.

–సంతబొమ్మాళి

ఉత్సాహంగా ఫ్రెషర్స్ డే..



పలాస ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఫ్రెషర్స్ డే వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. సీనియర్ విద్యార్థులు జూనియర్లకు స్వాగతం పలికారు. ప్రిన్సిపాల్ కె.నరసింహమూర్తి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎంఈవో సీహెచ్ సత్యం, ఇచ్ఛాపురం ప్రభుత్వ జూనయర్ కళాశాల ప్రిన్సిపాల్ చింతాడ శరత్‌బాబు, పూర్వపు ప్రిన్సిపాల్ బాడ మోహన్ మాట్లాడుతూ.. విద్యార్థులు క్రమశిక్షణతో విద్యాభ్యాసం చేయాలన్నారు. అధ్యాపకుల పట్ల గౌరవ భావన కలిగి ఉండాలన్నారు. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. అధ్యాపకులు హనుమంతు రామ్మోహన్‌దొర, తపన్‌కుమార్ జన్నా, తమ్మినేని వాసు, చాపర యుగంధర్ పాల్గొన్నారు.

–పలాస

నాయకుల పరామర్శ



సంతబొమ్మాళి మండలం ఉమిలాడ పంచాయతీ కాపు ఉమిలాడకు చెందిన వైఎస్సార్‌సీపీ మండల ప్రధాన కార్యదర్శి దుక్క అప్పారావు ఇటీవల మృతి చెందారు. దీంతో అతని కుటుంబాన్ని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్, టెక్కలి నియోజకవర్గ సమన్వయకర్త పేరాడ తిలక్ సోమవారం పరామర్శించి సంతాపం తెలియజేశారు. కోటబొమ్మాళి జెడ్పీటీసీ సభ్యుడు దుబ్బ వెంకటరావు, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు కెల్లి జగన్నాయకులు, పార్టీ నాయకులు మేరుగు అప్పారావు, అన్నెపు రామారావు, రోణంకి మల్లయ్య, హేమసుందరరాజు, కిల్లిఅజయ్, దుక్క రామక్రిష్ణ, సింగుపురం వినోద్, ఉన్నారు.

– సంతబొమ్మాళి